సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 19 । జూలై । 2025



వేతనాలకు ఎదురుచూపులు
ఉపాధి కూలీలకు రెండు నెలలుగా వేతనాలు విడుదల కాలేదు. దీంతో వీరంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో



ఆటపాకలో ఆహ్లాదం ఆవిరి
ఆటపాక పక్షుల విహారం కేంద్రం కళావిహీనంగా మారింది. కేంద్రంలోని చెరువులో బోటు షికారు నిలిపివేశారు. 8లో



ప్రైవేటు స్కూల్ బస్సు దగ్ధం
కుక్కునూరు మండలంలో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు దగ్ధమైంది. గ్రామస్తులు స్పందించి మంటలు ఆర్పివేశారు. 8లో

న్యూస్‌రీల్

శానిటేషన్ మేస్త్రి, వర్కర్ ఆత్మహత్యాయత్నం



కొండలరావును పరామర్శిస్తున్న వైస్ చైర్మన్ సత్యనారాయణ

నూజివీడు: నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి దూషించారంటూ పట్టణంలోని మున్సిపాలిటీలో పనిచేసే శానిటేషన్ మేస్త్రి దలాయి కొండలరావు, శానిటేషన్ కాంట్రాక్టు కార్మికురాలిగా పనిచేస్తున్న ఆయన భార్య పైడమ్మ శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. ఉదయం 9 గంటల సమయంలో ఇంటి వద్ద నిద్రమాత్రలు మింగగా కుటుంబసభ్యులు, స్థానికులు వారిని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ఆస్పత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం

భీమవరం (ప్రకాశంచౌక్): స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొందిద్దాం' అనే నినాదంతో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి తెలిపారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు స్థాయిల్లో తప్పక నిర్వహించాలని, ఈ మేరకు పంచాయతీరాజ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు ప్రణాళికను పక్కాగా అమలు చేయాలన్నారు. ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు 23న ఇంటర్వ్యూలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ పోస్టుల భర్తీకి ఈనెల 23న భీమవరంలోని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు మొదలవుతాయని, సంబంధిత పీజీ సబ్జెక్టుల్లో 50 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల యలమంచిలిలో ఇంగ్లిష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల వీరవాసరంలో కెమిస్ట్రీ, కామర్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల తాడేపల్లిగూడెంలో మేథమెటిక్స్, ఎస్‌సీఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల తణుకులో కామర్స్, ఎస్‌సీఐఎం జూనియర్ కళాశాల తణుకు సీఈటీలో బీటెక్ సివిల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల దుంపగడపలో బోటనీ, జువాలజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల గరల్స్ పాలకొల్లులో కెమిస్ట్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల అత్తిలిలో మేథమెటిక్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

పాత పెన్షన్ అమలు చేయాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ అమలు చేయాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తోందని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ప్రకటనలో తెలిపారు.

కల్లుగీత.. బెల్టు వ్యథ

ఉపాధికి గండి
- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులు
- తమ ఉపాధి దెబ్బతింటోందని గీత కార్మికుల ఆవేదన
- నష్టపోతున్న కుటుంబాలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్
- జిల్లాలో 10 వేల మంది గీత కార్మికులు



బెల్టుషాపులు ఎత్తివేయాలని భీమవరం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కల్లుగీత కార్మికులు (ఫైల్)

సాక్షి, భీమవరం: జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న మద్యం అమ్మకాలు కల్లుగీత కార్మికుల ఉపాధిని దెబ్బతీస్తున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. బెల్టు షాపుల ద్వారా ఊరువాడా తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ, ఎప్పుడు పడితే అప్పుడు మద్యం దొరుకుతోంది. దీంతో సంప్రదాయ కల్లుతాగే వారి సంఖ్య తగ్గిపోతుండటంతో తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని గీత కార్మికులు వాపోతున్నారు.

170 సంఘాలు.. 10 వేల కార్మికులు

జిల్లాలో 170 కల్లుగీత కార్మిక సంఘాల పరిధిలో 10 వేల మంది వరకు గీత కార్మికులు ఉన్నారు. తాడేపల్లిగూడెం, తణుకు, ఆచంట తదితర నియోజకవర్గాల్లో వీరి సంఖ్య అధికంగా ఉంది. ప్రాణాలకు తెగించి గ్రామాల్లో తాటిచెట్లు ఎక్కి కల్లును తీసి పొలం గట్లు, రోడ్లు వెంబడి మకాంలలో అమ్మకాలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. తరతరాలుగా ఈ వృత్తినే నమ్ముకుని ఉన్నారు. గ్రామాల్లో కళకళలాడే కల్లుగీతను కూటమి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టేసిందని కార్మిక సంఘం నేతలు విమర్శిస్తున్నారు.

బెల్టు బారులు.. మద్యం ఏరులు

జిల్లాలో 193 మద్యం దుకాణాలకు గాను పట్టణ ప్రాంతాల్లో దాదాపు 71 షాపులు ఉండగా, 410 పంచాయతీల పరిధిలో 122 షాపులు ఉన్నాయి. మద్యం దుకాణాలు లేని గ్రామాల్లో లిక్కర్ సిండికేట్లు బెల్టు షాపులు ఏర్పాటుచేసి అమ్మకాలు చేయిస్తున్నారు. లైసెన్స్‌డ్ షాపు పరిధిలో రెండు నుంచి ఐదు వరకు బెల్టులు ఉన్నట్టు సమాచారం. సముద్ర తీరం, మెట్ట ప్రాంతాల్లోని కొన్ని గ్రామాల్లో బెల్టు షాపుల కోసం లోపాయికారీగా వేలం పాటలు కూడా జరిగాయి. తీర ప్రాంతంలోని ఒక గ్రామంలో రూ.17.80 లక్షలకు, మరో గ్రామంలో రూ.6 లక్షలకు బెల్టు షాపులు దక్కించుకున్నట్టు గీత కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు చిన్న చిన్న బడ్డీ దుకాణాల్లో మద్యం సీసాలు పెట్టి అమ్మకాలు చేయడంతో పాటు కావాల్సిన చోటుకి డోర్ డెలివరీ కూడా చేస్తున్నారు.

గీత కార్మికుల డిమాండ్లు

బెల్టుషాపులను రద్దు చేసి కల్లుగీత కుటుంబాలను ఆదుకోవాలని, బెల్టులతో నష్టపోయి న కుటుంబాలకు రూ.లక్ష ఆర్థిక సహకారం అందించాలని, బెల్టు షాపుల ఎత్తివేతకు గ్రామస్థాయిలోని ఉద్యోగులతో కమిటీలు ఏర్పాటుచేయాలని, వృత్తి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందితే వారి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఇటీవల కలెక్టర్‌కు కల్లుగీత కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.

కల్లు.. తల్లకిందులు

జిల్లాలో మద్యం ఏరులై పారుతుండటంతో కల్లు **అమ్మకాలు గణనీ**యంగా తగ్గినట్టు కార్మికులు **చెబుతున్నారు. గత** ప్రభుత్వంలో నిబంధనలు **కచ్చితంగా అమల**య్యేవని, బెల్టుషాపుల జాడే **ఉండేది కాదన్నారు**. ఉదయం 11 గంటల నుంచి **రాత్రి 8 గంటల** వరకు నిర్ణీత వేళల్లో మాత్రమే **మద్యం అమ్మకాలు** చేయడం వలన గీత కార్మికు**లకు ఎటువంటి** ఇబ్బంది ఉండేది కాదన్నారు. **గతంలో ప్రధాన** రహదారుల వెంబడి ఒక్కో మకాంలో రోజుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు, గ్రామాల్లో రూ.1,500లు నుంచి రూ. 2,000ల వరకు అమ్మకాలు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో రూ.200ల నుంచి రూ.300 అమ్మకాలు జరగడం గగనమవుతోందని చెబుతున్నారు. గోదావరి చెంతనే రక్షిత నీటి కోసం ఇబ్బందులున్నా కానీ మద్యానికి కొదవ ఉండటం లేదంటున్నారు. బెల్టులు ఏర్పాటుచేసిన మద్యం షాపులకు మొదటిసారి రూ.5 లక్షలు జరిమానా విధించాలని, రెండోసారి తప్పుచేస్తే లైసెన్స్ రద్దు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు 370 మందిని అరెస్టు చేసి 730 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నా ఒక్క షాపునకు జరిమా విధించడం గాని, లైసెన్స్ రద్దు చేసిన దాఖలాలు కాని లేకపోవడం కూటమి సర్కారు ద్వంద్వ నీతికి నిదర్శనమంటున్నారు.

గీత కార్మికులంటే చంద్రబాబుకు చిన్నచూపు



కల్లుగీత కార్మికులంటే చంద్రబాబుకు చిన్నచూపు. మద్యం ఆదాయం కోసం కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేస్తున్నారు. తెలంగాణ, కేరళలో కల్లుగీత కార్మికులకు ప్రోత్సాహకాలు అందిస్తుంటే మన రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఉన్న వాటిని అమలు చేయకుండా గీత కార్మికులకు అన్యాయం చేస్తోంది.
–జుత్తిగ నరసింహమూర్తి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భీమవరం

ఎల్లవేళలా మద్యం అమ్మకాలు



బెల్టు షాపులు వచ్చాక కల్లు తాగే వారు బాగా తగ్గిపోయారు. ఎక్కడపడితే అక్కడ చిన్న చిన్న బడ్డీకొట్టుల్లో ఎల్లవేళలా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. కల్లు దుకాణంలో గతంలో రోజుకు రూ.2 వేల వరకు అమ్మకాలు చేస్తే ఇప్పుడు రూ.200 కూడా అమ్ముడుపోవడం లేదు.
–బి.రత్నం, కల్లుగీత కార్మికుడు, ఆరేడు, ఉండి మండలం

గిరిజనులను విస్మరించిన కూటమి ప్రభుత్వం



గిరిజన తెగల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న పెంద్ర వీరన్న

భీమవరం(ప్రకాశం చౌక్): గిరిజనులను కూటమి ప్రభుత్వం విస్మరించి, వారికి రిజర్వేషన్లు అమలు చేయడంలో అన్యాయం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెంద్ర వీరన్న అన్నారు. స్థానిక అంబేడ్కర్ భవనంలో సాలా శ్రీను అధ్యక్షతన శుక్రవారం గిరిజన తెగల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వీరన్న మాట్లాడుతూ భీమవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి గిరిజన మహిళకు రిజర్వేషన్ కాగా దీనిని మార్చి ఓసీ మహిళకు కేటాయించారన్నారు. గిరిజనులకు అన్యాయం జరిగిందంటూ కలెక్టర్, జేసీలకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎస్టీ వర్గాలు రాజకీయ పదవులకు అర్హులు కాదా అని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలకొల్లు ఏఎంసీ చైర్మన్ పదవితో పాటు శాసనమండలిలో కూడా గిరిజనులకు అవకాశం కల్పించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ తీరు ఇలానే ఉంటే గిరిజనులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఎస్టీ వర్గాలకు అన్యాయం

వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాల మాట్లాడుతూ నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు, అలాగే మహిళలకు 50 రిజర్వేషన్ అమలు చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఈ రిజర్వేషన్లు మార్పులు చేసి కూటమి ప్రభుత్వం ఆయా వర్గాలకు అన్యాయం చేస్తోందన్నారు. ఎస్టీ వర్గాలు రాజకీయంగా చైతన్యం కావాలని వారికి వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ భీమవరం ఇన్‌చార్జ్ చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ భీమవరం ఏఎంసీ చైర్మన్ పదవిని ఎస్టీ మహిళకు కేటాయించి తదుపరి ఓసీ మహిళకు కేటాయించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్టీ వర్గాలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చులకన భావనకు ఇదే నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మేడిది జాన్సన్ మాట్లాడుతూ గిరిజనులకు అన్యాయం జరిగిందని, తాము అండగా ఉంటామన్నారు. పార్టీ నేత గంటా సుందర్‌కుమార్ మాట్లాడుతూ దళిత జేఏసీ తరఫున పూర్తి బాధ్యత తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భారతి విజయరాజు, ఎస్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రమేష్, కూతాడ పెద్ద సత్యనారాయణ, సాల వెంకటేశ్వరరావు, కారంపూడి అనంత నాగు, ఎస్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ పాలనతో ప్రజాస్వామ్యానికి చేటు

- సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వం
- ప్రశ్నించిన వారిపై 4,500 కేసులు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి



తూర్పుపాలెంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, చిత్రంలో జిల్లా నేతలు

పెనుగొండ: ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనతో ప్రజాస్వామ్యం పీక నొక్కుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. శుక్రవారం తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆచంట నియోజకవర్గస్థాయి బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముదునూరి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలపై ప్రశ్నిస్తుంటే ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. కూటమి ఏడాది పాలనలో సంక్షేమాన్ని మరిచి ప్రశ్నించిన వారిపై 4,500 కేసులు నమోదు చేశారన్నారు. రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి సంక్షేమం నాలుగు రెట్లు అమలు చేస్తామని బ్యాండ్లు ఇచ్చి, ఇప్పుడేమో సంపద ఎలా ఉందో సృష్టించాలో చెప్పాలంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, యువత, మహిళలు, నిరుద్యోగులు ఇలా అన్నివర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అలాగే గత జగన్ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను నిలిపివేశారన్నారు. ఇంటింటికీ రేషన్ అందించే ఎండీయూ వాహనాలను మూలకు చేర్చారన్నారు. ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రశ్నించడం మరిచి పోయారన్నారు. చంద్రబాబు మోసాన్ని ప్రతి గడపకూ తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణుల కు పిలుపునిచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

అడుగడుగునా దోపిడీ

మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ సంక్షేమం అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకుండా, వనరులు దోచుకోవడంపై దృష్టి పెడుతోందని విమర్శించారు. అడుగడుగునా దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. పొలాలకు నీరు సరఫరా, రైతులకు ధాన్యం సొమ్ముల చెల్లింపులో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు.

పింఛన్లకు తిలోదకాలు

నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి పాలకులు కొత్త పింఛన్ల మంజూరుకు తిలోదకాలు ఇచ్చి ఆరు లక్షల పింఛన్లు నిలిపి వేశారన్నారు. చంద్రబాబు వంచనను మండల, గ్రామ స్థాయిలో ప్రతి ఇంటా వివరించాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 34 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేశామని, కూటమి పాలనలో ఒక్కరికైనా ఇంటి స్థలం ఇచ్చారా అని ప్రశ్నించారు. కార్యకర్తలు భయపడాల్సిన పని లేదని, రాబోయేది జగన్ ప్రభుత్వమే అన్నారు.

చంద్రబాబు వంచనను ఎండగట్టాలి

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ మభ్యపెట్టడం చంద్రబాబు నైజమన్నారు. గత ప్రభుత్వం కన్నా ఎక్కువ సంక్షేమం ఇస్తామని చెప్పి ప్రజలను మరోసారి మోసగించారని, చంద్రబాబు వంచనను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యాచారాలు పెచ్చుమీరిపోతున్నాయన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు రాష్ట్రంలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఆయా వర్గాలకు నామినేటెడ్ పోస్టుల్లో 50 శాతం పదవులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయిస్తే నేడు దానిని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ పరిశీలకుడు ఖండవల్లి వాసు, ఎంపీపీలు సబ్బితి సుమంగళి, కేవీవీ నారాయణ రెడ్డి(వాసు), జెడ్పీటీసీలు గుంటూరి పెద్దిరాజు, కర్రి గౌరీ సుభాషిణీ, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పిల్లి నాగన్న, గూడూరి దేవేంద్రుడు, జక్కంశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ చేశారు.. జీతాలు ఆపారు



- పొజిషన్ ఐడీలు కేటాయించడంలో అలసత్వం
- గురువులకు జీతాలు లేక అగచాట్లు
- 4,884 మంది ఉపాధ్యాయులపై ప్రభావం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఇటీవల జరిగిన బదిలీల్లో స్థానచలనం కలిగిన ఉపాధ్యాయులకు ప్రభుత్వం జీతాలు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. ఏ చిన్నపాటి అవకాశం వచ్చినా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జీతాలను ఆలస్యం చేస్తోందని ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. తాజాగా ఉపాధ్యాయుల బదిలీలను సాకుగా చూపి జీతాలు చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు అందక ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

పొజిషన్ ఐడీలు కేటాయించడంలో..

సాధారణంగా ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు వారు బదిలీ అయిన ప్రాంతాల్లో జీతాలు తీసుకునేలా అక్కడి డీడీఓకు సమాచారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీని నిమిత్తం పొజిషన్ ఐడీలు కేటాయించాలి. గత నెల 15వ తేదీ లోపులో అన్ని క్యాడర్ల ఉపాధ్యాయుల బదిలీలను పూర్తి చేశారు. ఇది జరిగి నెల రోజులు దాటినా ఇప్పటికీ ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించలేదు. దీంతో జూన్‌కు సంబంధించి జూలైలో రావాల్సిన జీతాలు ఉపాధ్యాయులకు అందలేదు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్రస్థాయిలో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ అధికారులకు విజ్ఞప్తులు చేసినా చలనం కలుగలేదు. ఇప్పటివరకూ ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంగ్త్ కూడా నిర్ధారించిన దాఖలాలు లేవని సంఘ నాయకులు అంటున్నారు. ఈ కారణంగా వచ్చే నెల కూడా తమకు జీతాలు అందే సూచనలు కనిపించడం లేదని ఉపాధ్యాయ వర్గాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

జీతాలందక పాట్లు

సాధారణంగా జూన్‌లో ప్రతి కుటుంబంలో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలో పిల్లల స్కూల్ ఫీజులు, విద్యా సామగ్రి కోసం వేలల్లో వెచ్చించాల్సి ఉంటుంది. అలాగే బదిలీ అయిన ప్రాంతానికి వెళ్లేందుకు రవాణా ఖర్చులు, ఇంటి అద్దెలు, అడ్వాన్సుల రూపంలో మరింత ఖర్చు పెరిగిందని, ఈ నేపథ్యంలో జీతాలు రాకపోవడం ఇబ్బంది కలిగిస్తోందని ఉపాధ్యాయులు అంటున్నారు.

4,884 మందిపై ప్రభావం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో మొత్తం 4,884 మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు. గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు 76 మందికి, మోడల్ ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా 284 మందికి, స్కూల్ అసిస్టెంట్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 2,274 మందికి, సెకండరీ గ్రేడ్, సమాన స్థాయి కేడర్ ఉపాధ్యాయులుగా 2,159 మందికి, లాంగ్వేజ్ పండితులు 42 మందికి, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు 33 మందికి, ఆర్ట్/డ్రాయింగ్/క్రాఫ్ట్/మ్యూజిక్ /ఒకేషనల్ ఉపాధ్యాయులు 16 మందికి స్థాన చలనం కలిగింది. జీతాలు విడుదల కాకపోవడం వీరిపై పెను ప్రభావం చూపుతోంది.

ఉపాధ్యాయులపై ఒత్తిడి



పాఠశాల విద్యాశాఖ అధికారులు తాము చేయాల్సిన పనిని సక్రమంగా చేయకుండా ఉపాధ్యాయులను ఒత్తిడిలోకి నెట్టడానికి చేస్తున్న ప్రయత్నాలు విరమించాలి. బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించే ఏర్పాట్లు చేయకుండా వారిపై యాప్‌ల అప్‌లోడ్ పేరిట భారం పెంచుతున్నారు. వెరీ అర్జెంట్, మోస్ట్ అర్జెంట్ అంటూ మెసేజ్‌లు పెట్టడం తప్ప ఉపాధ్యాయుల జీతాలు అర్జెంట్ అనే విషయాన్ని మరచిపోతున్నారు.
– తాళ్లూరి రామారావు, ఏపీటీఎఫ్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు

జీతాలు వెంటనే చెల్లించాలి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రాతిపదికగా ఇటీవల నిర్వహించిన బదిలీల్లో స్థానచలనం కలిగిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించే ఏర్పాటుచేయాలి. జీతాలు లేని కారణంగా సుమారు 5 వేల ఉపాధ్యాయ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. జీతాలు రాక ఈఎంఐలు కట్టడానికి కూడా లేక డిఫాల్ట్ అవుతున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులతో ఆడుకోకుండా ఆదుకోవాలి.
– గెడ్డం సుధీర్, వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తాగునీటి కోసం నిరసన



పోడూరు మండలం కవిటం బ్రిడ్జి వద్ద ఖాళీ బిందెలతో మహిళల ఆందోళన

పెనుగొండ: తాగునీటి సమస్యలు పరిష్కరించాలంటూ మహిళలు నిరసన బాట పట్టారు. పోడూరు మండలం కవిటంలో తాగునీరు లేక నానా అవస్థలు పడుతన్నామని శుక్రవారం మహిళలు ఖాళీ బిందెలతో నరసాపురం రహదారిపై కవిటం బ్రిడ్జి వద్ద నాలుగు రోడ్ల కూడలిలో బైఠాయించారు. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. తాగునీరు రాక ఇబ్బంది పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగడానికి కాలనీవాసులకు కనీసం ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. దీంతో పిల్లాపాపలతో దాహార్తితో అలమటిస్తున్నామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

21న తపాలా సేవలకు అంతరాయం

భీమవరం (ప్రకాశంచౌక్): డిజిటల్ ప్లాట్‌ఫారమ్ సర్వర్ మెయింటినెన్స్ కారణంగా ఈనెల 21న పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు నిర్వహించరని భీమవరం డివిజనల్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ కె.హరికృష్ణ ప్రసాద్ తెలిపారు. వినియోగదారులకు డిజిటల్ ఇంటర్‌ఫేస్‌ను అందించడానికి సర్వీసులను మెరుగుపర్చడానికి తాత్కాలిక సస్పెన్షన్ ఉంటుందన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం అధికార ప్రతినిధిగా సయ్యద్ బాజీ



మాజీ ఎమ్మెల్యే వాసుబాబును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సయ్యద్ బాజీ

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉంగుటూరుకు చెందిన షేక్ సయ్యద్ బాజీని నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును సయ్యద్ బాజీ, మైనారిటీ నేతలు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బాజీ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు 2000కు పైగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. గత జనవరి నుంచి అన్ని మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు అప్రూవ్ కాకుండా అలాగే ఉన్నాయని, విద్యాశాఖకు సంబంధించిన దాదాపు 700 బిల్లులు పరిష్కారానికి నోచుకోకుండా పడి ఉన్నాయని, త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరించకపోతే యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి అన్నారు. పీఎఫ్ లోన్లు అప్లికేషన్ పెట్టిన తర్వాత 20 రోజులలోపు సీఎఫ్ఎంఎస్ లోనికి వెళ్ళేలా చూడాలని కోరారు.

మావుళ్ళమ్మ దేవస్థానం చైర్మన్‌గా నాగభూషణం

భీమవరం(ప్రకాశంచౌక్): భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్‌గా బొండాడ నాగ భూషణాన్ని నియమించినట్లు రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాగ భూషణాన్ని అభినందించి మాట్లాడారు. నాగ భూషణం మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

అగ్నిప్రమాదంలో బేకరీ దగ్ధం



సిద్ధాంతంలో అగ్నికి ఆహుతైన బేకరీ

పెనుగొండ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సిద్ధాంతంలో బెంగుళూరు అయ్యంగార్ బేకరీ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో రూ.25 లక్షలకు పైగా ఆస్తి నష్టం ఉంటుందని అంచనా వేస్తున్నారు. తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగి పెద్ద శబ్దాలతో భారీ స్థాయిలో మంటలు చెలరేగాయి. పాలకొల్లు నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయడానికి శ్రమించాల్సి వచ్చింది.

ఉపాధి వేతనాల కోసం ఎదురుచూపులు

- రెండు నెలలుగా అందని వైనం
- ఏలూరు జిల్లాలో రూ.50 కోట్లకు పైగా పేరుకుపోయిన బకాయిలు



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)



వేతనాల కోసం డ్వామా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం(ఫైల్)

ఏలూరు (టూటౌన్): ఉపాధి కూలీలకు నెలలు తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గత రెండు నెలలుగా వేతనాలు విడుదల కాలేదు. ఒక పక్క పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు లేకపోయినా కూలి డబ్బుల కోసం ఆశపడి పనిచేస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం పట్ల కూటమి ప్రభుత్వంపై ఉపాధి హామీ కూలీలు మండి పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతీ 15 రోజులకోసారి ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించేవారని దానికి భిన్నంగా ప్రస్తుత కూటమి పాలకులు రెండు నెలలు దాటినా వేతనాలు చెల్లించకపోవడం పట్ల ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 5.57 లక్షల మంది ఉపాధి కూలీలు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా 27 మండలాల పరిధిలో మొత్తం 3.77 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 5.57 లక్షల మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారు. కూలికి ఏడాదికి వంద రోజులు పనిదినాలు కల్పించాల్సి ఉండగా జిల్లాలో సగటున ఒక్కో కూలీకి 46 రోజుల పనిదినాలనే కల్పించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్దేశించిన ప్రకారం ప్రతి 15 రోజులకొకసారి కూలీలకు వేతనాలు చెల్లించాల్సి ఉండగా అది ఎక్కడా అమలు కావడం లేదు. కూలీలకు పే స్లిప్స్ ఇవ్వడం లేదు.

రూ.50 కోట్ల బకాయిలు

ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో కూలీలకు గత మే 15 నుంచి ఇంతవరకు దాదాపు రెండు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదు. దీంతో ఏలూరు జిల్లాలో కూలీలకు రూ.50 కోట్ల వేతన బకాయిలు పేరుకుపోయాయి. మే, జూన్ నెలలకు సంబంధించి వేతన బకాయిలు మొత్తం రూ.50 కోట్లు ఉన్నాయి. వీటికి అదనంగా ప్రస్తుత జూలై నెలకు సంబంధించిన బకాయి వేతనాలు మరో రూ.10 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది.

పని ప్రదేశాలలో కనీస సౌకర్యాల కరవు

ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనుల్లో భాగంగా పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఇటు ఉపాధి కూలీలు, అటు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పని ప్రదేశాలలో నీడ కోసం టెంట్, మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు, పనిముట్లు, మేట్లకు రూ.5 అదనపు పారితోషికం ఇవ్వాలని కోరుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్నాయని వాటిని ఎదుర్కోవటం కోసం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చెబుతున్నారు.

200 రోజులకు పెంచాలి



ఉపాధి హామీలో పనిదినాలు 100 రోజుల నుంచి 200 రోజులకు పెంచాలి. సుప్రీం కోర్టు చెప్పినట్లు కనీస వేతనం రూ.600 ఇవ్వాలి. పని ప్రదేశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి. పనిముట్లు, మెడికల్ కిట్లు, మజ్జిగ, టెంట్, మంచి నీరు వంటివి ఏర్పాటు చేయాలి. పనికి తగ్గ వేతనం సక్రమంగా ఇవ్వాలి.

పీవీ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం

అప్పులు చేసి బతకాల్సి వస్తోంది



మే నుంచి కూలి డబ్బులు అందలేదు. రోజువారీ కూలి పనులు చేస్తేనే మా కుటుంబ పోషణ గడిచేది. రెండు నెలలుగా ఉపాధి కూలీ డబ్బులు అందకపోవడంతో అప్పులు చేసి బతకాల్సి వస్తోంది. ఒక ప్రక్క వ్యవసాయ పనులు లేవు. మరో పక్క పూర్తి స్థాయిలో ఉపాధి పనులు కల్పించడం లేదు.

బుద్దుల గంగాభవానీ, ఉపాధి కూలీ, టి.నర్సాపురం

మూడు నెలలుగా డబ్బులు అందలేదు



ఇప్పటికీ మూడు నెలలుగా ఉపాధి కూలీ సొమ్ములు అందలేదు. దీంతో పిల్లల చదువులు, కుటుంబ పోషణకు ఇబ్బంది ఏర్పడుతుంది. కుటుంబ జీవనం చాలా ఇబ్బందిగా తయారైంది. ఏడాదికి వంద రోజులు పనులు కల్పిస్తామని హామీ ఇచ్చినా క్షేత్ర స్థాయిలో దాన్ని అమలు చేయడం లేదు. ఇప్పటికైనా పాలకులు దయతలచి వేతన బకాయిలను తక్షణం చెల్లించాలి.

ఉడతా వెంకటేష్, ఉపాధి కూలీ, బుట్టాయగూడెం

కనీస వేతనం ఇవ్వడం లేదు



ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రోజుకు రూ.307 చెల్లించాలనే నిబంధన ఉన్నా కొల్లేరు ప్రాంతంలోని ఉపాధి కూలీలకు రోజుకు రూ.150 నుంచి రూ.200 మాత్రమే ఉపాధి వేతనాలు చెల్లిస్తున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. ప్రతి 15 రోజులకు వేతనాలు చెల్లించాల్సి ఉండగా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారు.

చిన్నం మాధవ, వనదుర్రు, ముదినేపల్లి మండలం

మంచినీటి చెరువులో చేపలు మృతి



మంచినీటి చెరువులో చనిపోయిన చేపలు

కాళ్ల: మండలంలోని కోలనపల్లి రక్షిత మంచినీటి సరఫరా చెరువులో చేపలు చనిపోవడంపై గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గత ఐదు రోజులుగా చెరువులో చేపలు చనిపోయి నీటిపై తేలటంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నీరు కలుషితంగా మారి చేపలు చనిపోయాయా.. లేక ఆక్సిజన్ అందక చనిపోయాయా అన్న విషయంపై సందిగ్ధత నెలకొంది. ఇటీవల చెరువుకు నీరు నింపారని, దానివల్లే చేపలు ఇలా చనిపోతున్నాయా? అని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చనిపోయిన చేపల వల్ల వాసనతో చెరువు చుట్టూ ఉన్న కుటుంబాలతో పాటు రోడ్డుపై వెళ్ళే వారు ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. చెరువు గట్టు చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తుందని, విషసర్పాలకు ఆవాసంగా చెరువుగట్టు మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఓ పక్క గ్రామంలో మంచినీటి కోసం నానా అవస్థలు పడుతుంటే మరో పక్క ఇలా మంచినీటి చెరువులో చేపలు చనిపోవటంపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణిని వివరణ కోరగా చెరువులో ఉన్న నీటిను వెంటనే పూర్తిస్థాయిలో బయటికి మళ్ళించి, కొత్తనీరు పెట్టాలని పంచాయతీ అధికారులకు సూచించామన్నారు. చెరువు గట్టు చుట్టూ ఉన్న చెత్త, చెదారాలు పూర్తిస్థాయిలో తొలగించాలని కార్యదర్శికి తెలిపామన్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సు దగ్ధం



దగ్ధమైన స్కూల్ బస్సు

కుక్కునూరు: మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు దగ్ధమైన ఘటన గురువారం రాత్రి జరిగింది. మండలంలోని ప్రైవేటు పాఠశాల స్కూల్ బస్సులో విద్యార్థులను గమ్యస్థానాలకు చేర్చిన అనంతరం డ్రైవర్ గణపవరంలో బస్సు నిలిపి ఉంచాడు. రాత్రి 7 గంటల తరువాత బస్సులో ఉన్నట్టుండి మంటలు చెలరేగి బస్సు మంటల్లో చిక్కుకుంది. దీంతో గ్రామస్తులు స్పందించి మంటలను ఆర్పివేశారు. మంటలు అంటుకోవడానికి షార్ట్ సర్క్యూటా లేక మరేదైనా కారణమా తెలియాల్సి ఉంది. ఇదే ప్రమాదం విద్యార్థులు ఉన్నప్పుడు జరిగి ఉంటే పరిస్థితి ఏమిటని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలు కాలం చెల్లిన వాహనాలకు రంగులు వేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్న ఆరోపణలు మిన్నంటుతున్నాయి. బస్సులకు అటెండర్లను నియమించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాల యాజమాన్యం గత వారం రోజుల క్రితం వరకు బస్సును వారి పేరు మీదకు మార్పు చేయకుండానే స్ప్రింగ్ లీఫ్ అనే తెలంగాణ అడ్రస్ తో ఉన్న బస్సును వినియోగించింది. ఇందుకు రవాణా శాఖ నిర్లక్ష్యమేనని పలువురు వాఖ్యానిస్తున్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా పోటీలు ప్రారంభం

తణుకు అర్బన్: తణుకులో బ్యాడ్మింటన్ జిల్లా పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. అండర్ 11, 13, 15, 17, 19 కేటగిరీల్లో బాల బాలికలు, పురుషులు, మహిళలు, వెటరన్స్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించనున్నట్టు బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎస్‌కేఎస్‌డీ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీహెచ్ సత్య ఉషారాణి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎం.వంశీకృష్ణ తెలిపారు. పోటీల్లో ప్రతిభ చూపినవారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు చెప్పారు. ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు సమ్మెట్ల హేమంత్‌శ్రీ, ఆకుల త్రిలోక్, మాన్ మనోజ్ఞ, చల్లా విజయచరణ్‌లను ఘనంగా సత్కరించారు. ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఎ.రాధాకృష్ణ, అకాడమీ కోచ్ సుదర్శన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బస్సు కాదు.. మొండి ఇది



జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తున్న బస్సు శుక్రవారం మండలంలోని గుర్వాయిగూడెం సమీపంలో నిలిచిపోయింది. బస్సు బ్రేక్‌లు సరిగా పనిచేయకపోవడంతో డ్రైవర్ బస్సు నిలిపేసి జంగారెడ్డిగూడెం డిపోకు సమాచారం ఇచ్చారు. డిపో నుంచి వచ్చిన మెకానిక్‌లు బస్సుకు మరమ్మతులు నిర్వహించారు. అనంతరం ప్రయాణికులతో బస్సు ఏలూరు వెళ్లింది. అయితే బస్సు మరమ్మతులు పూర్తయ్యి తిరిగి ఏలూరు వెళ్లే వరకూ రోడ్డుపై వేచి ఉండాల్సి వచ్చింది. బస్సులను కండిషన్‌లో ఉంచి సర్వీసులు నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు. - జంగారెడ్డిగూడెం

అమ్మవారికి ఆషాఢం సారె





తణుకు మండలం దువ్వలో వేంచేసియున్న దానేశ్వరి అమ్మవారికి గ్రామ మహిళలు శుక్రవారం భారీగా సారె సమర్పించారు. సారెతో వెళ్తున్న మహిళలతో దువ్వ గ్రామ రహదారులు కిక్కిరిశాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సారె సమర్పించిన మహిళలకు దేవస్థానం, దాతల సహకారంతో అన్న ప్రసాదాన్ని అందచేసినట్లు ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ తెలిపారు. సారె సమర్పణలో సుమారుగా 2 వేల మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. - తణుకు అర్బన్

బాలికపై వృద్ధుడి లైంగిక దాడి

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

నూజివీడు: పదకొండేళ్ల బాలికపై ఓ వృద్ధుడు కామంతో కళ్లు మూసుకుపోయి లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఏలూరు జిల్లాకు చెందిన బాలిక (11)పై ఆమె ఇంటి పక్కనే ఉండే గజ్జల నాగమల్లేశ్వరరావు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రులు ఇద్దరూ కూలి పనులకు వెళ్తుంటారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరూ వేసవి సెలవుల్లో ఇంటి వద్దే ఉండేవారు. కుమార్తెను గత జూన్ 13న బాలికల హోమ్‌లో చేర్చారు. రెండు రోజుల క్రితం హాస్టల్ వార్డెన్ లలితకుమారి బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి చిన్నారి ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. బాలిక తల్లిదండ్రులకు హాస్టల్‌కు వెళ్లడం కుదరలేదు. దీంతో వార్డెన్ లలితకుమారి బాలికను సముదాయించి అడగ్గా... తమ ఇంటి పక్కన ఉండే గజ్జల నాగమల్లేశ్వరరావు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని చెప్పింది. దీంతో వార్డెన్ వెంటనే ఈ విషయాన్ని బాలిక తల్లికి తెలియజేశారు. ఆమె రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ జ్యోతిబసు శుక్రవారం కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ద్విచక్ర వాహనాలు దగ్ధం

ఉండి: ఉండి మండలం కోలమూరులో రెండు ద్విచక్రవాహనాలు దగ్ధమయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని రజకుల వీధి చెరువుగట్టు సమీపంలో యర్రశెట్టి దివ్య, మారిశెట్టి మహేష్‌కు చెందిన వాహనాలతో పాటు మరికొందరు రహదారి పక్కగా తమ ద్విచక్రవాహనాలను గురువారం రాత్రి నిలిపిఉంచారు. గురువారం అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి రెండు ద్విచక్రవాహనాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. గమనించిన స్థానికులు తమ వాహనాలను ప్రక్కకు లాగడంతో వాటికి ప్రమాదం తప్పింది. ఉండి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఆటపాక కేంద్రంలో ఆహ్లాదం ఆవిరి



కళావిహీనంగా మారిన ఆటపాక పక్షుల విహార కేంద్రం ప్రారంభ ద్వారం



నీరు లేక వెలవెలబోతున్న ఆటపాక పక్షుల కేంద్రం చెరువు

- జూలై సగం గడిచినా నిండని విహార చెరువు
- నిరాశగా వెనుదిరుగుతున్న పర్యాటకులు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామం ఆటపాక పక్షుల విహారం కేంద్రం కళావిహీనంగా మారింది. గత ఏడాది ఇదే రోజుల్లో పక్షుల విహార చెరువు నీటితో కళకళలాడింది. అధికారుల ముందస్తు ప్రణాళిక లోపించడంతో ఏటా చెరువు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల కొల్లేరు సమస్యలపై అధ్యయనం చేయడానికి సుప్రీంకోర్టు ఆదేశాలతో వచ్చిన కేంద్ర సాధికారిత కమిటీ(సీఈసీ) సభ్యులకు నీరు లేకుండా సహజ అందాలను కోల్పోయిన పక్షుల కేంద్రాన్ని చూపించారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో సుదూర ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు కేంద్రం సందర్శనకు వచ్చి బోటు షికారు లేకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

ఆటపాక పక్షుల విహార కేంద్రం రాష్ట్రంలోనే వినుతి కెక్కింది. ఇతర దేశాల నుంచి పెద్ద సంఖ్యలో అరుదైన పెలికాన్ పక్షులు ఆటపాకకు రావడం, సంతానోత్పత్తి తర్వాత తిరిగి వెళ్ళడం క్రమం తప్పకుండా జరిగేది. దీంతో ఆటపాక పక్షుల కేంద్రాన్ని పెలికాన్ ప్యారడైజ్‌గా పిలిచేవారు. పక్షుల కేంద్రంలో విహార చెరువు 286 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. పక్షుల ఆవాసాలకు 158 కృత్రిమ ఇనుప స్టాండ్లను అటవీశాఖ ఏర్పాటు చేసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఆటపాక పక్షుల కేంద్ర సందర్శనకు పెద్ద ఎత్తున పర్యాటకులు ఏటా విచ్చేస్తున్నారు.

నీటి సరఫరాలో నిర్లక్ష్యం

ఆటపాక పక్షుల విహార కేంద్రం చెరువులో నీటిని నింపడం ఏటా అటవీ శాఖకు తలనొప్పిగా మారుతోంది. ఇక్కడ చెరువులో 6 అడుగులు నింపే కెపాసిటి ఉంది. సమీపంలోని పోల్‌రాజ్ డ్రెయిన్‌లో నీటని అటవీ శాఖ చెరువుకు ఏర్పాటు చేసిన తూములు తెరిచి నీటిని నింపుతారు. సాధారణంగా జూలై నెలలో పక్షుల విహార చెరువు పూర్తిగా నీటితో నిండుతుంది. అలాంటిది ఈ ఏడాది జూలై నెల ముగింపు దశకు వస్తున్నా కేవలం అడుగు నీరు మాత్రమే ఉంది. నీరు పూర్తి స్థాయిలో లేకపోవడంతో పక్షులు హాయిగా విహరించే అవకాశం లేదు. ఆటపాక గ్రామంలో పంట కాల్వలో నీరు పుష్కలంగా ఉంది. జాన్‌పేట సమీపం నుంచి బోదె ద్వారా కాల్వ నీటిని నింపుకునే అవకాశం ఉంది. పక్షుల కేంద్రం సమీపంలో ఆక్వా చెరువులలో నిండుగా నీరు ఉండటం, పక్షుల విహార చెరువులో మాత్రం నీరు లేకపోవడం బాధకరమని పలువురు వాపోతున్నారు.

బోటు షికారు లేదు

ఈ కేంద్రంలో బోటు షికారు ప్రత్యేకం.పెలికాన్, పెయింటెడ్ స్టార్క్‌తో సహా పలు రకాల పక్షుల్ని దగ్గర నుంచి వీక్షించవచ్చు. దీంతో ప్రతి ఒక్కరూ బోటు షికారు కోసం క్యూ కడతారు. కొన్ని నెలలుగా బోట్లు మూలన పడ్డాయి. సందర్శకుల ప్రవేశం, బోటు షికారు రేట్లను పెంచారని అందుకు తగ్గట్లుగా మౌలిక సౌకర్యాలను మెరుగుపర్చాలని పక్షి ప్రేమికులు కోరుతున్నారు.

వర్షాలు పడకపోవడం వల్లే..



ప్రతీ ఏటా విస్తార వర్షాల కారణంగా పోల్‌రాజ్ డ్రెయిన్‌లో నీరు ఎక్కువగా వచ్చేది. ఆ సమయంలో పక్షుల దొడ్డి తూము తెరిచి నీటిని నింపుతాం. అలాంటిది పోల్‌రాజ్‌లో అనుకున్న నీరు రాలేదు. పక్షుల కేంద్రానికి విచ్చేసే పర్యాటకుల కోసం మరో కొత్త విహార బోటును తీసుకొస్తున్నాం. ఇప్పటికే రెండు బోట్లు ఉన్నాయి. రహదారుల అభివృద్ధి, ప్రత్యామ్నాయ నీటి వనరుల కోసం ప్రతిపాదనలు పంపాం. - ఎం.రంజిత్‌కుమార్, డిప్యూటీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, కైకలూరు

ఇది ప్రభుత్వ వైఫల్యమే



నీరందక నెర్రలిచ్చిన నారుమళ్లు

దెందులూరు: కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరు అందక నారుమళ్లు ఎండిపోతున్నాయి. ఏలూరు రూరల్ మాదేపల్లి, కాట్లంపూడి, లింగారావుగూడెం గ్రామాల్లో బీటలు వారిన సాగు పొలాలను రైతు సంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న సాగునీటిని కేఈ కెనాల్‌లోకి మళ్లించి కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని కోరారు. ఇరిగేషన్ అధికారుల ప్రణాళికా లోపంతో అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోందని, ఇది ప్రభుత్వం, అధికారుల వైఫల్యమేనని విమర్శించారు. పంట కాలువలు తూడు, గుర్రపు డెక్క, నాచు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయని చెప్పారు. వేసవికాలంలో తగిన విధంగా కాలువల బాగు చేసే పనులు చేపట్టలేదని చెప్పారు. గుర్రపు డెక్కను తొలగించకుండా కలుపు మందు చల్లారని, ఈ నీటినే ఏలూరు రూరల్ మండలంలోని ప్రజలు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తారని, అత్యంత ప్రమాదకర కలుపు మందులు చల్లడం దారుణమన్నారు. కార్యక్రమంలో అన్నం రెడ్డి రంగారావు, సుంకర నరసింహారావు, వి.రామారావు, పి.భాస్కరరావు, టి.రంగారావు, బైరెడ్డి కష్టారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భూమి రికార్డుల్లోని తప్పొప్పులను సరి చేసుకోవాలి



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం, యాగర్లపల్లి, కడకట్ల రెవెన్యూ గ్రామాల్లోని వ్యవసాయ భూమి రికార్డుల్లో ఏమైనా తప్పొప్పులు ఉంటే సరి చేసుకోవాలని తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. భూమి విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, అడంగల్, పట్టాదారు పేర్లలో తప్పులు ఉన్నా, మృతి చెందిన పట్టాదారులను వెబ్ ల్యాండ్ నుంచి తొలగిస్తామన్నారు. వారి స్థానంలో అర్హులైన కుటుంబ సభ్యులను మ్యూటేషన్‌కు రిజిస్టర్ దస్తావేజు నకలు, ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్, పాస్ పోర్టు సైజు ఫొటోలతో నాలుగు రోజుల్లో వార్డు రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు.

198 ఆవులకు టీకాలు



నీలాద్రిపురం గ్రామంలో ఆవులకు లంపి చర్మవ్యాధి నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో ఆవుల్లో లంపి చర్మవ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీవీ.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వైరస్ వల్ల వచ్చే జబ్బుని టీకాల ద్వారా నివారణే ఉత్తమమని పేర్కొన్నారు. శనివారం కడియద్ద గ్రామంలో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

దాతల సహాయ సహకారాలు అభినందనీయం



భవిత సెంటర్‌లో సేవా కార్యక్రమాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): భవిత సెంటర్ విద్యార్థులకు సేవలు అందిస్తున్న డైమండ్స్ సభ్యులు, దాతల సహాయ సహకారాలు అభినందనీయమని భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, ఉపాధ్యాయిని ఎం.చంద్రకుమారిలు కొనియాడారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం దాతలు జొన్నల రవితేజ, డైమండ్స్ మార్కెటింగ్ చైర్‌పర్సన్ జొన్నల సతీష్ కుమార్ సహకారంతో భవిత విద్యార్థులకు అల్పాహారం, స్టేషనరీ, ఆట వస్తువులు, మొక్కలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి సతీష్, సెక్రటరీ కోటి విజయ కిషోర్, ఆకుల సతీష్, సుబ్రహ్మణ్యం, , నాగలక్ష్మి, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



ర్యాలీలో గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు వక్తలు తెలిపారు. శుక్రవారం రక్తదానంపై తాడేపల్లిగూడెంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తానం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డా.గీతాబాయి, గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల ప్రజావేదిక

ఉండి: మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని 19 గ్రామాల్లో నిర్వహించిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై గత వారం పదిరోజులుగా గ్రామ గ్రామాన సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి పూర్తి చేశారు. అయితే మండలంలో జరిగిన పనులకు,చెల్లించిన చెల్లింపులకు ఏ మాత్రం పొంతన లేదని సామాజిక తనిఖీ బృందాలు ప్రతి గ్రామసభలోనూ తేల్చేసారు. అయితే జరిగిన పనులు సరిగ్గానే జరిగాయని ఉపాధి హామీ మండలాధికారులు, సిబ్బంది అంటున్నారు. మండల వ్యాప్తంగా సుమారు రూ.6 కోట్ల విలువైన 1081 పనులు నిర్వహించగా వాటిలో రూ.3 కోట్ల వరకు అధిక చెల్లింపులు చేసినట్లు సామాజిక తనిఖీ అధికారులు భావిస్తున్నారు. అయితే శనివారం జరిగే మండలస్థాయి ప్రజావేదిక సభలో జిల్లా ఉన్నతాధికారులు ఎంత వరకు నిగ్గుతేల్చుతారో తెలియాల్సి ఉంది.

మండపాకలో సమస్యల పాగా



మండపాక - పైడిపర్రు రోడ్డులో రోడ్డును కమ్మేసిన పిచ్చిమొక్కలు



మండపాకలో మురికికూపంగా మురుగుతో మడుగు

- డ్రెయినేజీల్లో మేటలు వేస్తున్న మురుగు
- శిథిలావస్థకు చేరిన వంతెన
- ఛిద్రమైన రహదారులు
- గగ్గోలు పెడుతున్న మండపాకవాసులు

తణుకు అర్బన్: తణుకు మండలంలోని మండపాక గ్రామంలో సమస్యలు పాగావేశాయి. మురుగు పారని మడుగుకుతోడు డ్రెయినేజీల్లో పేరుకుంటున్న మురుగు కారణంగా ప్రబలుతున్న దోమల వ్యాప్తితో మండపాకవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని హరిజనవాడతోపాటు ఇతర ప్రాంతమంతా కూడా డ్రెయినేజీల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు ప్రవాహానికి ఆటంకం కలిగి దుర్గంధంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. పగలు, రాత్రి దోమల బాధ ఎక్కువైపోయిందని వాటి తీవ్రతకు జ్వరాల కేసులు నమోదు అవుతుండడంతో ఏరకాల వ్యాధులు వస్తాయోనని మండపాకవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తణుకువైపు నుంచి గ్రామంలోకి వచ్చే క్రమంలో పైడిపర్రు దాటిన తరువాత సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయి రోడ్డును సైతం కమ్మేయడంతో రోడ్డు వెడల్పు కుదించుకుపోవడమే కాకుండా వాహనదారుల ప్రమాదాల పాలవుతున్నారు. పిచ్చి మొక్కల కారణంగా విషసర్పాలు, కొండచిలువలు ఈ ప్రాంతంలో తిష్టవేసి రోడ్డుకు అటు ఇటు ప్రయాణాలు చేస్తుండడంతో మండపాక వాసులతో పాటు మండపాక మీదుగా ఇతర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు సైతం బెంబేలెత్తిపోతున్నారు. మండపాక గ్రామంలో సుమారుగా 9వేలకు పైగా జనాభా ఉన్నారు.

ఛిద్రమైన రహదారి, శిథిలమైన వంతెన

మండపాకనుంచి అత్తిలి, వరిఘేడు తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డు ఛిద్రమైపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లోను, వర్షాలు పడిన సందర్భాల్లోను వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలపాలైపోతున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. అంతేకాకుండా శ్రీయల్లారమ్మ తల్లి ఆలయానికి సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరడంతో ఆ ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారిందని దీనికితోడు వంతెన మలుపులో మొక్కలు ఏపుగా ఎదిగి రోడ్డును కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో లారీలు, ఆటోల రాకపోకలు అధికసంఖ్యలో ఉండడంతో ఏ ప్రమాదం పొంచి ఉందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.



మండపాకలో ప్రమాదకరంగా మారిన వంతెన ప్రాంతం



మండపాకలో రాళ్లులేచిన రోడ్డు



మండపాకలో మురుగుమేట వేసిన డ్రెయినేజీ

హామీల అమలులో ‘కూటమి’ విఫలం

మంచిలిలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ

అత్తిలి: ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సాయంత్రం అత్తిలి మండలం మంచిలి గ్రామంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో పథకాలు ప్రకటించి వాటిని ప్రజలకు అందించకుండా చేశారని విమర్శించారు. యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలు ఇలా అన్నివర్గాలను ఏడాదికిపైగా మోసం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దారం శిరీషాచినబాబు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సత్తి చిన్నురెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు పీవీఎస్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు వేంద్ర రాంపండు, కొల్లాటి ఏలియ్య, దాస్, వెంకటేష్, ధనరాజు, గోవిందరావు, నితిన్, కొరు నరశింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మంచిలి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలకు షాక్ కొట్టే అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పట్టణ ప్రజలకు సీపీఎం జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. తాడేపల్లిగూడెం సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని యాగర్లపల్లి, రామచంద్రరావుపేట, కొబ్బరితోట వార్డుల్లో ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న కరెంట్ మీటర్లు తొలగించి అదానీ స్మార్ట్ మీటర్లను బిగించాలని కూటమి ప్రభుత్వం చూస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు, షాపులకు స్మార్ట్ మీటర్లు బిగించారని, బిగించిన తరువాత కరెంట్ బిల్లులు షాక్ కొట్టేలా ఉన్నాయని తెలిపారు. సెల్‌ఫోన్ పద్ధతిలో ముందుగానే రీఛార్జ్ చేయించుకోవాలని, అధిక రేట్లు వసూలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, సభ్యులు జవ్వాది శ్రీను, శిద్ధిరెడ్డి శేషు, పోతు శ్రీను, అన్నం చిన్నారావు, కన్నంరెడ్డి శివాజీ, సాయి, నాగేంద్రబాబు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. డ్రై డే మాసోత్సవాలు విజయవంతం చేయాలని కోరుతూ కడకట్ల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 27, 29 వార్డులలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ వ్యాధుల పట్ల అప్రమత్తం అవసరమని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, జ్వరం వచ్చినట్లు అయితే అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య సిబ్బందినిగాని, ఏరియా ఆసుపత్రినిగాని సంప్రదించాలని కోరారు. ఇంటిలోపల, పరిసరాలలోను నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కాంతారావు, ఎన్ఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

లారీ ఢీకొని యువకుడి మృతి

పాలకొల్లు సెంట్రల్: లారీ, మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం నరసాపురానికి చెందిన లంక అప్పారావు (23) యువకుడు పూలు తెచ్చుకునేందుకు రాజమండ్రి వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో రాజమండ్రి నుంచి తిరిగి ఇంటికి వస్తుండగా పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామంలో పెట్రోల్ బంక్ సమీపంలోకి వచ్చేసరికి పాలకొల్లు నుంచి మార్టేరు వెళుతున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అప్పారావు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బావమరిది షేక్ హసిఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై బి సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఉద్యమాలు చేస్తామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. సీఐటీయూ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు శుక్రవారం సమ్మె ప్రారంభించారు. మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్షా శిబిరం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు గతంలో నిర్వహించిన 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనం రూ.26 వేలకు పెంచాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కార్మికుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు చేయాలని, చనిపోయిన లేదా అనారోగ్యంతో రిటైర్మెంట్ అయిన స్థానంలో వారి వారసులకు అవకాశం ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా వేతనాలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు వెంకట్రావు, తాడికొండ జయరాం, ధనాల రాజు, ఎస్.సతీష్, నీలాపు ధనరాజు, దయామణి, కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో కాంట్రాక్ట్ కార్మికులు

శాకంబరి అలంకరణలో అమ్మవార్లు



ఆరవల్లిలో శాకంబరిదేవిగా కనకదుర్గమ్మ



శాకంబరిదేవిగా లలితాదేవి

అత్తిలి: ఆషాడ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో కనకదుర్గమ్మ అమ్మవారిని శాకంబరిదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. పలురకాల కూరగాయలు, ఆకు కూరలతో అమ్మవారిని విశేష అలంకరణ చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

దేవతలారా.. దీవించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జువ్వలపాలెం రోడ్డులోని లలితదేవి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరి దేవిగా విశేషంగా అలంకరించారు. మానేపల్లి శ్రీనివాస్, కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో, ఆకు కూరలతో అలంకరించారు. మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అలాగు స్థానిక కేఎస్ఎన్ కాలనీలోని అనంతమ్మ తల్లిని శాకంబరి దేవిగా విశేష అలంకరణ గావించారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. షోడగిరి గోపాలరావు, సత్యనారాయణ, గాయిత్రిదేవి, బంగారు రాజు, భవాని, సురేష్, జోన్నల సత్యనారాయణ, అన్నవరం, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

నరసాపురం: స్థానిక వైఎన్ బీఈడీ కళాశాలలో బోధనోపకరణాల ద్వారా బోధన అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా పాల్గన్న బీఈడీ కళాశాల కరస్పాండెంట్ కానూరి స్వామినాయుడు మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులతో బోధనా పద్ధతులు కూడా అధ్యాపకులు మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ట్రెజరర్ పి.రఘురామారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శాంతి తదితరులు పాల్గొన్నారు.

అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ పునఃప్రారంభించాలి

అత్తిలి: అత్తిలి రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించినప్పటికీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ పునః ప్రారంభం అయ్యేలా కరుణించాలని కోరుతూ సుబ్రహ్మణ్యమాలధారణ భక్తులు అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దీక్ష చేపట్టిన సుమారు 100 మంది భక్తులు స్వామివారి ఆలయానికి విచ్చేసి అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చూడాలని కోరుతూ స్వామి వారి తరపున ఆలయ అర్చకులు ఐలూరి రామం, కృష్ణమూర్తికి వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో రాజకీయ నాయకులకు, అధికారులకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకపోవడంతో అత్తిలిలో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి వినతి పత్రం అందజేసినట్లు భక్తులు తెలిపారు.



అత్తిలిలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి వినతిపత్రం అందజేస్తున్న భక్తులు

ఫిషింగ్ హార్బర్ నిర్మించాలి

నరసాపురం: నరసాపురం తీరప్రాంతంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన ఫిషింగ్ హార్బర్‌ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఆర్.కృష్ణయ్య బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్‌భవానీ కోరారు. ఈ మేరకు శుక్రవారం నరసాపురం ఆర్డీఓ దాసి రాజును కలిసి వినతిపత్రం ఇచ్చారు. అభివృద్ధిలో నరసాపురం ప్రాంతం వెనకమడిందని అన్నారు. ఎప్పుడో బ్రిటీష్ హయాంలోనే ముఖ్య వాణిజ్య కేంద్రంగా పేరొందిన నరసాపురం ప్రాంతంలో నేడు ఉపాధి కరువైందని అన్నారు. ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తే పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పెమ్మాడి మోహన్‌లాల్, గొర్ల దుర్గారావు, బోడెటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఎల్‌పీఎం పరిష్కారానికి గ్రామ సభలు

యలమంచిలి: రీ సర్వే పూర్తయిన గ్రామాలలో భూములు జాయింట్ ఎల్‌పీఎంలో ఉండిపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా అన్నదాత సుఖీభవ, కౌలు రైతు కార్డు, పీఎం కిసాన్, తల్లికి వందనం వంటి పథకాలు అమలులో జాయింట్ ఎల్‌పీఎం కారణంగా రైతులకు ఆ పథకాలు మంజూరు కావడం లేదు. ఈ సమస్య పై జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. గ్రామాలలో సభలు ఏర్పాటుచేసి జాయింట్ ఎల్‌పీఎం వల్ల ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి ఆన్‌లైన్ సబ్ డివిజన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చించినాడ సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటుచేసి రైతుల నుంచి 10 అప్లికేషన్లు స్వీకరించారు. కాజ, మేడపాడు, శిరగాలపల్లి, బూరుగుపల్లి గ్రామాలలో శనివారం గ్రామ సభలు నిర్వహిస్తామని, జాయింట్ ఎల్‌పీఎం వలన ఇబ్బందులు పడుతున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పవన్ కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్ సన్, వీఆర్వో సరెళ్ల లక్ష్మి, గ్రామ సర్వేయర్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

రోగులకు మెరుగైన సేవలందించాలి

నరసాపురం: పీహెచ్‌సీలకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందించాలని జిల్లా వైద్య అధికారి జి.గీతాబాయ్ ఆదేశించారు. శుక్రవారం ఆమె పట్టణంలోని మున్సిఫ్‌స్ట్రీట్, ఎన్టీఆర్ కాలనీ పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వైద్యులకు పలు సూచనలు చేశారు. సమయానికి వైద్యులు విధులకు హాజరు కావాలన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ప్రస్తుతం వానాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీల్లో అందిస్తున్న సేవలపై ఫిర్యాదులు వస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఎస్‌వో సర్వేశ్వరరావు, డీపీహెచ్ వెంకటరమణారావు, పీహెచ్‌సీల అధికారులు మోహనలక్ష్మి, రంజిత్‌కుమార్ ఉన్నారు.

21న పోస్టల్ సేవలకు విరామం

తాడేపల్లిగూడెం: డిజిటల్ ఎక్స్‌లెన్స్ సేవలను వినియోగదారులకు అందజేసే నిమిత్తం అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ(ఏపీటీ)ని అందుబాటులో తేనున్నారు. ఈ క్రమంలో తాడేపల్లిగూడెం పోస్టల్ డివిజన్ పరిధిలో అన్ని పోస్టాఫీసులను సాంకేతికంగా ఆధునికీకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ ఒక రోజు డివిజన్ పరిధిలో అన్ని పోస్టాఫీస్‌ల్లో వినియోగదారుల సేవలు అందుబాటులో ఉండవని, వినియోగదారులు సహకరించాలని సూపరింటెండెంటు కె.కృష్ణ తెలిపారు. డౌన్‌టైమ్, డేటా మైగ్రేషన్, సిస్టమ్ ధ్రువీకరణ, కాన్ఫిగరేషన్ ప్రక్రియల కోసం సేవలకు ఒక రోజు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, వేగవంతమైన సేవలు, స్నేహపూర్వక ఇంటర్ ఫేస్, భవిష్యత్‌కు అవసరమైన సాంకేతిక రూపొందించడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొనండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): అంతర్జాతీయ చెస్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 20వ తేదీన తణుకు పట్టణంలోని స్టెప్పింగ్ స్టోన్స్ స్కూల్‌లో మాస్టార్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చదరంగం పోటీలు జరగనున్నాయని, ఈ పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభం అవుతాయని అకాడమీ చైర్మన్ సీహెచ్‌ఆర్‌కే వర్మ, అకాడమీ కార్యదర్శి ఎస్ఎస్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.10వేలు నగదు బహుమతితోపాటు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా పోటీలలో పాల్గొనవచ్చునని, పోటీలలో పాల్గొనే క్రీడాకారులందరికి ఉచిత భోజన సదుపాయం కల్పించనున్న ట్లు చెప్పారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ పేర్లను ఏపీ చెస్.ఆర్గనైజేషన్ వెబ్ సైట్ ద్వారా లేదా 94408 67370నెంబర్‌కు ఫోన్‌చేసి నమోదు చేసుకోవచ్చునని ప్రతినిధులు వివరించారు.